# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 309: దైవత్వము యొక్క అనేక అంశాలు
# మార్చ్ 2, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 18-23 నుండి తీసికొనబడినవి

**స్వామి! భగవంతుని సాకార నిరాకార స్వరూపముల గురించి చెప్పమని ప్రార్థిస్తున్నాము.**

భగవాన్: ఈ విషయం చాలా మందికి అర్థం కాదు. ఆకారం లేకున్న నిరాకారం ఎక్కడ నుండి వస్తుంది? నిరాకార స్వరూపాన్ని మనసులో ఎలా చిత్రించుకుంటారు? మీకు ఆకారం ఉంది కనుక భగవంతుని కూడా ఆకారంతోనే భావించగలరు. ఉదాహరణకు, ఒక చేప భగవంతుని తలచుకుంటే ఇంకా పెద్ద చేప ఆకారంలో తలుస్తుంది. ఒక దున్నపోతు భగవంతుని తలచుకుంటే ఇంకా పెద్ద దున్నపోతు ఆకారంలో తలుస్తుంది. అదే విధంగా మానవుడు కూడా భగవంతుని తలవాలంటే ఆదర్శవంతమైన మానవ రూపంలోనే తలవగలడు.

భగవంతుని నిరాకార స్వరూపమును కూడా సాకార స్వరూపం ద్వారా ధ్యానం చేయవచ్చు. ఆకారం లేకుండా నిరాకారం పొందలేవు. ఒక చిన్న ఉదాహరణ. ఈరోజు మీరందరూ ఇక్కడ కోడైకనాల్లో ఈ హాల్లో కూర్చొని ఉన్నారు. స్వామి సంభాషణ వింటున్నారు. ఈ అనుభవం ఆకారంతో కూడినది. కొన్ని రోజుల తర్వాత మీరు ఇంటికెళ్ళి ఇక్కడ జరిగినవన్నీ తలచుకుంటారు. స్వామి మీ ఇంటికి భౌతికంగా వచ్చారా? ఈ హాలు మీ ఇంట్లో ఉంటుందా? ఇక్కడ ఉన్న వారందరూ అక్కడ ఉంటారా? లేదు. కానీ ఇక్కడ ప్రత్యక్షంగా జరిగిన అనుభవం మనసులో చిత్రీకరించుకుంటే, అది పరోక్షంగా అనుభవించవచ్చు. ఇక్కడ చూసినది సాకారమైతే అక్కడ అనుభవించేది నిరాకారం. కనుక నిరాకార స్వరూపం సాకార స్వరూపం పై ఆధారపడియుంది.

ఇంకొక ఉదాహరణ. ఈ పాలను నీకు తాగాలనిపించింది. ఎట్లా తాగుతావు? ఒక కప్పో గ్లాసో కావాలి కదా? అదే విధంగా దేవుడిని (పాలు) పూజించాలంటే నీకు ఆకారం (కప్పు) అవసరం.

**స్వామి, ఈ సాకార నిరాకార పూజలలో, ఏది గొప్పది?**

భగవాన్: నా దృష్టిలో రెండూ సమానమే. ఒక దానికంటే ఇంకొకటి గొప్పది కాదు. ఇప్పుడు మీరు కోయంబత్తూరులో ఉన్నారు. ఇక్కడ భూమి ఎత్తులు పల్లాలు లేకుండా సమానంగా ఉంది. ఈ భూమిని ఎవరూ ఈ విధముగా చదును చేయలేదు. కోయంబత్తూరు యొక్క ఆకారం ఇలా ఉంది. కానీ కోడైకనాల్ కొండల పైన ఉంది. ఆ కొండలను ఎవరూ అక్కడ అమర్చలేదు. దాని ఆకారమే అలాంటిది. కోయంబత్తూరు కోడైకనాల్ ఒక దాని నుండి ఒకటి వేరుగా ఉంటున్నాయి. రెండూ పూర్ణంగానే ఉంటున్నాయి కానీ దేని ఆకారం దానిది.

అదే విధంగా సాకార, నిరాకారమనే రెండు రకముల పూజలు జ్ఞాన మార్గమున ఉన్నవారికి, మోక్ష మార్గమున ఉన్నవారికి రెండు విధములు ప్రయోజకరములే.

**స్వామి, వేదాలలో భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి అని వ్రాయబడినవి. దైవత్వము యొక్క ఈ అంశాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియచేయండి.**

భగవాన్: "బీజం మాం సర్వభూతానాం" అని భగవద్గీత చెబుతుంది. అంటే సృష్టికంతటికినీ భగవంతుడే బీజం. జీవులన్నిటికినీ భగవంతుడే బీజం. ఉదాహరణకు, ఒక మామిడి విత్తనం తీసుకుని భూమిలో నాటితే, కొన్ని రోజులకు ఆ విత్తనం మొలకెత్తుతుంది. దానికి క్రమముగా ఒక వేరు, ఒక కాడ, ఒక ఆకు, తర్వాత కొమ్మలు, పూవులు వస్తాయి. ఆ మొక్కలో ఉన్న ప్రతి భాగంలోనూ ఆ విత్తనం ఉంది. అన్ని భాగములూ విత్తనము నుండి ఆవిర్భవించినవే కనుక. చివరకు ఫలములో నున్న విత్తనములో కూడా ఆ విత్తనము ఉంటుంది. అదే విధంగా భగవంతుడు సృష్టి అంతటిలో ఉన్నాడు. ఈ లోకమంతయు చెట్టైతే, భగవంతుడు విత్తనము, జీవులన్నియు ఆ చెట్టు నుండి ఉద్భవించిన ఫలములు.

స్వామి! అందరిలో ఒకే దైవత్వం ఉంటే, మరి ఇన్ని భేదాలు ఎందుకు కనబడతాయి? దైవత్వమంతా ఒక్కటే అన్నప్పుడు, మాలో ఈ భేదాలు ఏమిటి?

భగవాన్: ఏకమేవ అద్వితీయం బ్రహ్మ, అనగా భగవంతుడు ఒక్కడే, ద్వితీయం అనేది ఉండదు, అని వేదం చెప్పుచున్నది. అయితే ఇన్ని రకాలు, భేదాలు, వ్యత్యాసాలు ఎందుకుంటాయి? ఒక చిన్న ఉదాహరణ: విద్యుచ్ఛక్తి ఒక్కటే అయినా ఎన్నో రకముల బల్బులు, రకరకాల వోల్టేజీలలో ఉంటాయి కదా? బల్బులో వోల్టేజీ తక్కువుంటే కొంచెమే వెలుతురు ఇస్తుంది. బల్బులో వోల్టేజీ ఎక్కువుంటే బాగా వెలుతురుగా ఉంటుంది. కానీ రెండింటిలో ప్రవహించే విద్యుచ్ఛక్తి ఒక్కటే. వోల్టేజీలలో తేడాల వలన వెలుతురు రకరకాలుగా కనపడుతుంది. అదే విధంగా మన శరీరాలు ఆ బల్బుల వలె వేరైనప్పటికీ అందరిలో ప్రవహించే దైవత్వం ఒక్కటే.

స్వామి! మీరు దైవత్వం అందరిలో ఉందని అన్నారు. మరి మేము పుట్టక ముందు ఎక్కడ ఉంది? మేము చనిపోయిన తర్వాత కూడా దివ్యత్వం ఉంటుందా?

భగవాన్: దైవం ఎప్పుడూ ఉంటాడు. దైవత్వం నిత్య, సత్య, నిర్మలమైనది. దైవత్వమునకు జనన మరణాలు ఉండవు. అది ఎల్లప్పటికీ శాశ్వతం, స్థిరం. దేశ కాలములకు అతీతమైనది. దైవత్వం శారీరిక, భౌతిక నియమాలకు అతీతమైనది.

నీ ప్రశ్న ఏమిటి? దైవత్వం పుట్టక ముందు ఎక్కడ ఉంది? చనిపోయిన తర్వాత ఎక్కడకు పోతుంది? ఆ గోడ పైన కరెంటు వైరు ఉంది. అక్కడక్కడ బల్బులు పెట్టడానికి సాకెట్లు ఉన్నాయి. ఆ సాకెట్లో బల్బు పెడితేనే వెలుగుతుంది, లేకుంటే లేదు. ఎందువలన? కరెంటు వైరులోంచి బల్బులోకి పోయి దానిని వెలిగిస్తుంది. ఆ బల్బుని నీ చేతిలో పట్టుకుంటే వెలుగదు, కరెంటు లేదు కనుక.
మీరు అర్థం చేసుకోవలసినది ఏమంటే ఆ కరెంటు బల్బు వెలిగించడానికి కొత్తగా పుట్టించినది కాదు. వైరులో ముందే కరెంటు ఉంది. బల్బు తీసేస్తే కరెంటు ఎక్కడికి పోతుంది? వైరులోనే ఉంటుంది. కాకుంటే వెలుతురు ఉండదు. అదే విధంగా మన శరీరం బల్బు అయితే, దైవత్వమనే కరెంటు అందులో ప్రవహిస్తుంది. శరీరమనే బల్బు తీసివేసినా దైవత్వమనే కరెంటు ప్రవహిస్తూనే ఉంటుంది. అంటే దైవత్వం నువ్వు పుట్టక మునుపు, పుట్టిన తర్వాత, చనిపోయిన తర్వాత కూడా కరెంటు వలె ఎల్లప్పుడూ ఉంటూనే ఉంది.

స్వామి! భగవంతుని హృదయవాసి అంటారు. హృదయమంటే మా ఛాతీకి ఎడమ భాగంలో ఉండేదేనా స్వామి?

భగవాన్: కాదు. కాదు. అది శారీరిక హృదయం. భగవంతుని స్థానం ఆధ్యాత్మిక హృదయం. హృ + దయ = హృదయ. దయతో నిండి ఉన్న దానిని హృదయం అంటారు. ఈ నడుమ దయ అనేది ఒక ఫ్యాషన్ అయిపోయింది. కాషాయవస్త్రాలు ధరిస్తారు కాని వారికి కసాయిహృదయాలు ఉంటుంటాయి.

శారీరిక హృదయం ఎడమ వైపు ఉంటే ఆధ్యాత్మిక హృదయం కుడి వైపున ఉంటుంది. ఆధ్యాత్మిక హృదయమే భగవంతుని యొక్క మందిరము. గీతలో కృష్ణుడు అన్నాడు, ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్టతి, అంటే భగవంతుడు నీ హృదయమనే మందిరంలో నివసిస్తాడు. భౌతిక, లౌకిక, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానములన్నియు మెదడుకు సంబంధించినవి కానీ హృదయానికి సంబంధించినవి కాదు. ప్రేమ, దయ, సత్యం, తాగం, క్షమ వంటివి హృదయానికి సంబంధించినవి.

స్వామి! దైవత్వమును విచారించి చూచుటకు వీలౌతుందా? విచారణతో దైవత్వమును అర్థం చేసుకోవచ్చా?

భగవాన్: ప్రాపంచిక అనుభవాలన్నీ దేశ కాలములచే పరిమితమవబడినవి. మీ ఇంద్రయములతో ప్రపంచమును అనుభవించవచ్చును. శాస్త్రము, సాంకేతిక జ్ఞానము పంచభూతములను శోధించి, రకరకాల విధములు ఉపయోగించి కంపూటర్లు, ఎలక్ట్రానిక్స్ వంటి వాటితో మానవులకు సుఖము, సౌఖ్యము అందచేస్తుంటాయి.

శాస్త్రవేత్త ప్రయోగాలు చేస్తాడు కానీ ఆధ్యాత్మిక మార్గమున ఉన్నవాడు అనుభవించే దైవత్వమును ప్రయోగశాలలో శోధించలేరు. భావాతీతమైన దైవత్వము గురించి ఏ విధంగా వర్ణించగలరు? గ్రాహ్యానికి అతీతమైన దైవత్వమును ఏ విధంగా చిత్రీకరించగలరు? అన్ని విచారణలకు, ఇంద్రియాలకు అతీతమైన దైవత్వమును ఏ విధంగా శోధించి పరిశోధనలు చేయగలరు? శాస్త్రము ప్రయోగములపై ఆధార పడి ఉంటే ఆధ్యాత్మికము అనుభావములపై ఆధార పడి ఉంటుంది. శాస్త్రంలో analyse చేస్తే ఆధ్యాత్మికంలో realise చేస్తావు.

ధన్యవాదములు!
ప్రొ. అనిల్ కుమార్ గారు వచ్చే వారములో స్వామి వారి అమ్మూల్యమైన సందేశములు మరి కొన్ని మనతో పంచుకొంటారు.

ఓం సాయి రాం!